# ప్రజలే నా బలం.. బలగం




నమస్తే తెలంగాణ ఇంటర్వ్యూలో రామగుండం బీఆర్ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్

నమస్తే ఇంటర్వ్యూ INTERVIEW

- నిరంతరం అందుబాటులో ఉన్నా
- వాళ్ల కష్టాల్లో పాలుపంచుకున్నా
- మెడికల్ కాలేజీ తెచ్చి రుణం తీర్చుకున్నా
- పెద్దమొత్తంలో నిధులు తెచ్చి రామగుండాన్ని తీర్చిదిద్దా
- ఇది ఉద్యమకారుడికి.. ఉద్యమ ద్రోహికి మధ్య యుద్ధం
- స్థానికుడా..? హైదరాబాద్‌లో ఉండే వ్యక్తా..? ప్రజలు ఆలోచించండి
- కండ్లముందున్న అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి
- 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూలో రామగుండం అసెంబ్లీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్

పెద్దపల్లి, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి పాలనలో రామగుండం వివక్షకు గురైందని, కార్మిక ప్రాంతానికి తీరని అన్యాయం జరిగిందని రామగుండం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరుకంటి చందర్ విమర్శించారు. తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే ఐదేండ్ల ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నానని చెప్పారు. తాను చేసిన అభివృద్ధి మీ కండ్ల ముందే కనిపిస్తున్నదని, ప్రజలు ఆలోచించి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక ఇంటర్వ్యూలో ఇచ్చారు. చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలే తనకు విజయాన్ని కట్టబెడతాయని, ప్రజలు కూడా పనిచేసిన తనను మరోసారి దీవిస్తారన్న నమ్మకం ఉన్నదని విశ్వాసం వ్యక్తం చేశారు.

**నమస్తే తెలంగాణ: మీ ప్రచారం ఎలా సాగుతున్నది?**

కోరుకంటి చందర్: బ్రహ్మాండంగా సాగుతున్నది. ఆత్మీయ సమ్మేళనాలతో అన్ని వర్గాలతో మమేకవుతున్న. ప్రజాఆశీర్వాదయాత్రల పేరిట ఊరూరా క్యాంపెయిన్ చేస్తున్న. ప్రజల నుంచి విశేషంగా స్పందన వస్తున్నది. రోడ్‌షోలకు ప్రజలు, ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నరు. చేసిన అభివృద్ధిని చూసి ఘన స్వాగతం పలుకుతున్నరు. కార్యకర్తలు సైతం ఉత్సాహంగా ప్రచారాన్ని కొనసాగిస్తున్నరు. రాత్రింబవళ్లు కష్టపడుతున్నరు. ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్నరు.

**నమస్తే: ప్రచారంలో ఏమైనా మీ మనసుకు హత్తుకొనే ఘటనలు ఉన్నాయా..?**

కోరుకంటి: అవును. ఒకటి కాదు.. రెండు కాదు, ఎన్నో మరిచిపోలేని అనుభవాలు ఎదురైనయ్. రామగుండం బల్దియా పరిధిలోని సప్తగిరి కాలనీ 6వ డివిజన్‌లో ఓ వృద్ధురాలు వచ్చి పలకరించింది. 'ఇంతకాలం ఇక్కడ దవాఖాన లేక కరీంనగర్‌కు వెళ్లేదాన్ని బిడ్డా.. కానీ, ఇప్పుడు మన పట్నంలనే పెద్దదవాఖాన ఏర్పాటు చేసినవ్. అక్కడికే పోయిన. పైసా ఖర్చు లేకుండా పరీక్షలు, టెస్టులు చేసి పంపిన్రు. ఈ దవాఖానల 30రోజులు ఉండి మంచిగై ఇంటికచ్చిన కొడుకా..' అని చెప్పడం నాకు కన్నీళ్లను తెప్పించింది. ఆ వృద్ధురాలు గట్టిగా హత్తుకొని కన్నీరు పెట్టుకున్న ఘటన గుర్తుకచ్చినప్పుడల్లా నా కళ్లు చెమ్మగిల్లుతయ్. కేవలం బీఆర్ఎస్ ఎమ్మెల్యేను కావడంతోనే ఈ అదృష్టం కలిగింది. ఇది నా పూర్వ జన్మ సుకృతం.

**నమస్తే: ఎమ్మెల్యేగా మీరు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమిటి?**

కోరుకంటి: రామగుండం ఎమ్మెల్యేగా జీవిత కాలం ప్రజలకు గుర్తుండేలా అభివృద్ధి చేసిన. సీఎం కేసీఆర్ సహకారంతో కార్మిక క్షేత్రానికి మెడికల్ కాలేజీ తెచ్చిన. అందులో సింగరేణి కార్మికుల పిల్లలకు 5శాతం రిజర్వేషన్ కల్పించిన. సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసు తెచ్చిన. ఖర్జూ కమ్మీ భూముల సమస్యలతో అరవైఏళ్లుగా వెతలు పడుతున్న 1800 మంది రైతులకు మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా పట్టాలు ఇప్పించిన. అసాధ్యమను కున్న రామగుండం కార్పొరేషన్‌లో కలిపిన కుందన్‌పల్లి, లింగాపూర్ గ్రామాల విలీనాలను రద్దు చేయించిన. నగరపరిధిలోని ప్రధాన కూడళ్లను గొప్పగా తీర్చిదిద్దిన. తెలంగాణ అమరుల త్యాగాలను గుర్తించి స్మారక స్తూపాన్ని నిర్మించిన. జ్యోతిరావు పూలే విగ్రహం, ఫౌంటెయిన్‌ను ఏర్పాటు చేసిన.

**నమస్తే: రామగుండం కార్మికులు, పారిశ్రామిక ప్రాంత ప్రగతికి ఏం చేశారు?**

కోరుకంటి: మంత్రి కేటీఆర్ సహకారంతో టీఎస్ఐడీసీ ద్వారా ₹100 కోట్లు తెచ్చిన. ఐటీ, ఇండస్ట్రియల్ పార్క్‌ల నిర్మాణానికి ఫౌండేషన్ వేసిన. ఈ పనులు పూర్తయితే రాష్ట్రంలోని ప్రధాన నగరాలతో సమానంగా రామగుండం అభివృద్ధి చెందుతుంది. కార్మికుల శ్రమకు గుర్తుగా ఫైవింక్లైన్‌లో గని కార్మికుల శారీరక సౌందర్యం ఉట్టిపడేలా విగ్రహాలను ఏర్పాటు చేసి గౌరవించుకున్నం. మిషన్ భగీరథ ద్వారా 40 వేల ఇండ్లకు నీరందిస్తున్నం.

**నమస్తే: మీరు మళ్లీ ఎమ్మెల్యేగా గెలిస్తే ఏం చేస్తరు?**

కోరుకంటి: ఇప్పటికే ఎంతో అభివృద్ధి చేసినం. ఇంకా సాధించాల్సింది చాలా ఉన్నది. పసలేని ప్రతిపక్షాల మాటలు విని ఆగం కావద్దు. రామగుండంలో గోదావరి నది ఉంది కాబట్టి టూరిజం స్పాట్, నదిపై కేబుల్ బ్రిడ్జి, కాళేశ్వరం బ్యాక్ వాటర్ నగరంలోకి రాకుండా కరకట్టలు నిర్మిస్త. ఇప్పటికే ప్రతిపాదనలు పంపించిన. పార్క్‌లు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసిన. ఉపాధి ఉద్యోగాల కల్పన కోసం కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేస్త. మూడు నెలలకోసారి జాబ్ మేళాలు నిర్వహించి యువతకు ఉద్యోగాలు కల్పిస్త. బొగ్గు, నీరు, కరెంట్ ఆధారిత పరిశ్రమలను నెలకొల్పుత. ఇండస్ట్రియల్ కారిడార్ చేస్త. కార్మికుల వేతనాలను పెంపునకు కృషి చేస్త.

**నమస్తే: కార్మికులకు మీరు, మీ ప్రభుత్వం చేసిందేమిటి?**

కోరుకంటి చందర్: సింగరేణి కార్మికులకు మా ప్రభుత్వం ఎంతో చేసింది. వారసత్వ ఉద్యోగాలు ఇచ్చింది. వారి తల్లిదండ్రులకు కార్పొరేట్‌స్థాయి వైద్యాన్ని ఫ్రీగా అందిస్తున్నది. ఇండ్లు కట్టుకోవడానికి ₹10లక్షల మిత్తీ లేని రుణాలు ఇస్తున్నది. సర్కారుకు నివేదించి కార్మికులకు క్వార్టర్లు సొంతం చేసేందుకు కృషి చేస్త.

**నమస్తే: ప్రతిపక్షాలు మీపై చేస్తున్న విమర్శలకు మీ సమాధానం?**

కోరుకంటి: ఇక్కడి అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు చేస్తున్నయి. కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నయి. వాళ్లు ఏం చేస్తారో చెప్పుకోలేక బట్ట కాల్చి మీద వేస్తున్నరు. ప్రజలు వివేకవంతులు అన్నీ గమనిస్తున్నరు. ఈనెల 30న ప్రగతి నిరోధకులకు కర్రు కాల్చి వాత పెడుతరు. బీఆర్ఎస్‌కే పట్టం గడుతరు. కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా చేస్తరు.

**నమస్తే: మీకూ మీ ప్రత్యర్థికి ఉన్న తేడా ఏమిటి?**

కోరుకంటి: నేను సామాన్య కుటుంబంలో పుట్టిపెరిగినోన్ని. నాకు ధన బలం లేదు. ప్రత్యర్థి ఖాతాల్లో కోట్లు, హైదరాబాద్‌లో ఆస్తులు ఉన్నయి. కానీ నా ఖాతాల్లో లక్షలే ఉన్నయి. అయినా పైసతో పనిలేదు. నాకున్నది ప్రజా బలం. పార్టీ బలమే. నేను మొదటి నుంచి ప్రజల మధ్యనే ఉన్న. ప్రజల కోసమే ఉద్యమాలు చేసిన. ప్రజాసేవకే ఈ జీవితాన్ని అంకితం చేసిన. రామగుండం నియోజకవర్గ ప్రజలే నా కుటుంబం. నాకు సర్వస్వం. కానీ, ప్రత్యర్థికి హైదరాబాద్‌లో ఉన్న సెలబ్రిటీలే ముఖ్యం. అక్కడే ఉంటడు. ఎన్నడూ ఇక్కడ ప్రజల కోసం పనిచేయ లేదు. ఐదేళ్లు శాప్ చైర్మన్‌గా పనిచేసి కనీసం రామగుండానికి షటిల్ కోర్టు కూడా తీసుకురాలేదు. అలాంటి ఈ రోజు ఏదో చేస్తా అంటే నమ్మద్దు. నేను తెలంగాణ ఉద్యమ కారుడిని. ప్రత్యర్థి తెలంగాణ ద్రోహి. బీఆర్ఎస్ అంటే ఇంటి పార్టీ. కాంగ్రెస్ అంటే ఢిల్లీ పార్టీ. మన ఇంటి అవసరాలు మన పార్టీకే తెలుస్తయి. ఢిల్లీకి తెలియవు. ఓటర్లు గ్రహించాలి.

**నమస్తే: మీ పార్టీలోకి శ్రేణులకు గుర్తింపు ఎలా ఉన్నది?**

కోరుకంటి: బీఆర్ఎస్ ఎంతో గొప్ప పార్టీ. ఉద్యమ చరిత్ర ఉన్న పార్టీ. తెలంగాణను అభివృద్ధి చేసిన పార్టీ. సీఎం కేసీఆర్ నేతృత్వంలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించినం. అందుకే గులాబీ పార్టీలోకి కాంగ్రెస్, బీజేపీ నుంచి నేతలు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో చేరుతున్నరు. పనిచేసే వారందరినీ అక్కున చేర్చుకుంటున్నం. కష్టపడ్డవారికి తగిన రాజకీయ అవకాశాలను ఇస్తం.

**నమస్తే: అగ్రనేతల ప్రచారం ఉన్నదా..?**

కోరుకంటి : ఇప్పటికే నియోజకవర్గంలో కార్యకర్తలు ఫుల్ జోష్‌తో ప్రచారం చేస్తున్నరు. వృద్ధులు, మహిళలు, యువకులు స్వచ్ఛందంగా హోరెత్తిస్తున్నారు. ఈ నెల 18న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ మంత్రి కేటీఆర్ రోడ్‌షో, ఈ నెల 24న సీఎం కేసీఆర్ రామగుండంలో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొంటారు.

**నమస్తే: రామగుండంలో యువత ఎక్కువ వారి కోసం ఏం చేస్తారు?**

కోరుకంటి: సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమంతోపాటు యువ నేత కేటీఆర్ ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పన కోసం చేస్తున్న కృషి యువతకు తెలుసు. రాష్ట్రంలో 22 లక్షల మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఉపాధి ఉద్యోగ, అవకాశాల కల్పన కోసమే రామగుండాన్ని దత్తత తీసుకుంటానని ఇప్పటికే ప్రకటించారు. ఆయన నేతృత్వంలో రామగుండం ప్రగతి గొప్పగా ఉంటుంది. ఇప్పటికే ఆయన ఐటీ, ఇండస్ట్రియల్ పార్కులకు శంకుస్థాపన చేశారు. అవి అందుబాటులోకి వస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతయి.

**నమస్తే: బీఆర్ఎస్ మ్యానిఫెస్టో ఎలా ఉన్నది?**

కోరుకంటి: కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు పింఛన్ ₹200లే ఉండేది. అది కూడా ఊళ్లో ఎవరైనా చస్తారా.. పోతారా.. అని చూసుకుంటూ ఇచ్చేది. పదేండ్లలో పైసా కూడా పింఛన్ పెంచలే. కానీ, ఎన్నికలు రాగానే ఆరు గ్యారెంటీలు అని ప్రజల వద్దకు వెళ్లి సంతకాలు పెట్టిస్తున్నరు. ప్రజలు వారిని నమ్మడం లేదనే ఈ విధంగా చేస్తన్నరు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం వృద్ధులు, అభాగ్యులకు అండగా నిలిచింది. ఇప్పటికే పింఛన్ పదిరెట్లు పెంచింది. మళ్లీ పెంచుతామని భరోసా ఇచ్చింది. కేసీఆర్ భరోసా పేరిట ఇస్తున్న పథకాలను నమ్ముతున్నరు. మా మ్యానిఫెస్టోను విశ్వసిస్తున్నరు. ప్రజలంతా బీఆర్ఎస్ వైపే ఉన్నారు.

**నమస్తే: ప్రజలకు మీరేం చెబుతారు?**

కోరుకంటి: నేను మీ బిడ్డను. 24 గంటలు నియోజకవర్గాన్ని పట్టుకొనే ఉన్న.. ఉంట. ప్రజలు చైతన్యవంతులు, ఉద్యమ నేత కేసీఆర్ ఇచ్చిన ఒక్క పిలుపునకు ఇల్లిల్లూ కదిలి తెలంగాణ కోసం ఉద్యమంలో ఏ విధంగా పాల్గొన్నారో.. అదే స్ఫూర్తితో ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు ఓటు వేయాలి. పదేండ్లకు ముందున్న తెలంగాణ. రామగుండాన్ని ప్రత్యక్షంగా చూశారు. నగరాభివృద్ధికి పునాదులు పడి పరుగులు తీస్తున్నది. ఏ చిన్న తప్పిదం జరిగినా అది అభివృద్ధికి నిరోధమైతది. కాంగ్రెస్ దేశాన్ని రాష్ట్రాన్ని మన ప్రాంతాన్ని వెనక్కి నెట్టింది. వారి పాలనలో బొగ్గుబావులు మూతపడ్డయి. ఉద్యమ కారుడిని గెలిపిస్తారా..? ఉద్యమ ద్రోహిని గెలిపించుకుంటరో..? మీరే ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి.

## కేటీఆర్ పిలుపుతో బీఆర్ఎస్‌లోకి ఆకుల స్వామి



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో పార్టీ లో చేరిన ఆకుల స్వామి వివేక్‌పటేల్

- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన అమాత్యుడు

పెద్దపల్లి టౌన్ నవంబర్ 16: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు పెద్దపల్లి అసెంబ్లీ ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకుల స్వామి వివేక్ పటేల్ బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. బుధవారం సిరిసిల్లలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో పార్టీలో చేరారు. బీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలని కోరారు. ఇక్కడ బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులు కొమటిపల్లి రాంజేందర్ ఉన్నారు.

## రెండో ర్యాండమైజేషన్ పూర్తి

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజామ్మిల్ ఖాన్



పెద్దపల్లి: రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియలో కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్, సంబంధిత అధికారులు

పెద్దపల్లి, నవంబర్16: జిల్లాలో జరిగే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది రెండవ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో రామగుండం అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేష్ సింగ్ రానా, పెద్దపల్లి, మంథని అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల సాధారణ పరిశీలకులు సీఎన్ శ్రీధర, పోలీస్ పరిశీలకులు కే కిషోర్, సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ పోలింగ్ సిబ్బంది రెండవ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జిల్లాలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 837 పోలింగ్ కేంద్రాలున్నాయని, వీటిలో 130 పోలింగ్ కేంద్రాలు భూపాల్‌పల్లి జిల్లాలో ఉన్నాయని వాటికి సిబ్బందిని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కేటాయిస్తారని, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ధర్మారం మండలంలోని 53 పోలింగ్ కేంద్రాల సిబ్బందిని ఇక్కడి నుండి కేటాయించడం జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాలకు ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారి, ఓపీవో లను కేటాయించడం జరుగుతుందని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం 20 శాతం అదనంగా సిబ్బంది కేటాయింపు ప్రక్రియ చేపట్టామని తెలిపారు. జిల్లాలో మొత్తం 913 మంది ప్రిసైడింగ్ అధికారులు, 913 మంది సహాయక ప్రిసైడింగ్ అధికారులు, 1826 మంది ఓపీవోలు, 138 మంది మైక్రో అబ్జర్వర్లను పారదర్శకంగా ఎన్ఐసీ హైదరాబాద్ రూపొందించిన సాఫ్ట్ వేర్ వినియోగిస్తూ ఆన్‌లైన్‌లో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసామని తెలిపారు. ఈ ర్యాండమైజేషన్ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రామగుండం రిటర్నింగ్ అధికారి జే అరుణ శ్రీ, అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్, అధికారులు పాల్గొన్నారు.